క్లుప్తంగా

పన్ను తగ్గించాలని ఇళ్ల యజమానుల వినతి



భూత్పూర్: మున్సిపాలిటీలోని ఇళ్లకు ట్యాక్స్ అధికంగా వేస్తున్నారని తగ్గించాలని స్థానికులు అన్నారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం వినతి పత్రం అందజేశారు. మహబూబ్‌నగర్, జడ్చర్ల మున్సిపాలిటీలతో పోలిస్తే భూత్పూర్‌లో ఇళ్లకు రెండింతలు అధికంగా పన్నులు వేస్తున్నారని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణంలోని ఇళ్ల యజమానులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

రాజాపూర్: అక్రమంగా కృత్రిమ ఇసుకను తయారు చేస్తుండగా పోలీసులు దాడి చేసి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్న ఘటన మండలపరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే చెన్నవెల్లి శివారులో దుందుభీ వాగులో ఇసుక ఫిల్టర్‌ను నిర్వహిస్తున్నారన్న సమాచారం పోలీసులకు అందింది. దీంతో హెడ్‌కానిస్టేబుల్‌గౌస్, శంకర్‌లు అక్కడి వెళ్లి డ్రైవర్ బక్కన్నను, ఇసుక ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

కాంగ్రెస్‌ది ప్రజా ప్రభుత్వం

సాక్షినెట్‌వర్క్: కాంగ్రెస్‌ది ప్రజా ప్రభుత్వమని కోయిల్‌కొండ మండల అధ్యక్షుడు జి.రవీందర్, బ్లాక్ అధ్యక్షుడు విద్యాసాగర్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మహబూబ్‌నగర్ సభకు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. నాయకులు రాజునాయక్, రవినాయక్, మహేందర్, సత్యపాల్‌రెడ్డి, విఠల్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట అధ్యక్షుడు రాంచంద్రయ్య మంగళవారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సభకు తరలిరావాలని సూచించారు. దేవరకద్ర అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, కొకుంట్ల అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, భూత్పూర్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి , అడ్డాకుల, మూసాపేట మండలాల అధ్యక్షులు తోట శ్రీహరి, శెట్టిశేఖర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శరత్‌కుమార్‌రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి సభకు తరలిరావాలని వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు.

డబుల్ బెడ్‌రూంలు ఇవ్వాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జర్నలిస్టులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి విజయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. వర్కింగ్ జర్నలిస్టులు సొంతఇల్లు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అద్దె ఇళ్లలో ఉంటూ సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆదుకోవాలని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో గోపాల్, రఫీ, మోయిజ్, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పశ్చిమబెంగాల్‌లో అధికారంలో ఉన్న టీఎంసీ దిష్టిబొమ్మను పాలమూరు యూనివర్సిటీ ఏబీవీపీ నాయకులు మంగళవారం దహనం చేశారు. పాలమూరు విభాగ్ కన్వీనర్ నరేష్ తేజా మాట్లాడుతూ బెంగాల్‌లోని సందేశ్‌కాళీ ఘటన దేశంలో చర్చనీయాశంగా మారిందన్నారు. టీఎంసీ నాయకులు షాజహాన్‌షేక్ అతడి అనుచరులు గిరిజన తెగ ప్రాంతాల ప్రజలపై దాడులు చేయడం, అక్రమ భూకబ్జాలు, మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. పార్టీ కార్యాలయాల్లో సైతం మహిళలపై దాడులు జరుగుతున్నాయని.. ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. అర్జున్, కృష్ణకుమార్, నందిని, నీరేష్, వేణు, ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

నారాయణపేట రూరల్: తైక్వాండోలో మెడల్స్ సాధించిన విద్యార్థులను మంగళవారం అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు అభినందించారు. మరికల్ పీస్ ఏంజెల్స్ స్కూల్‌కు చెందిన 16మంది చిన్నారులు పాల్గొని 12మంది ఫస్ట్ ప్లేస్‌లో నిలిచారు. వీరిలో ఒకరు గోల్డ్‌మెడల్, 4సిల్వర్ మెడల్స్, 7బ్రౌన్ మెడల్స్‌ను పొందారు. వీరికి స్థానిక జిల్లా క్యాంప్ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడిని కలుసుకోగా వారికి ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేశారు. కరాటే నేర్చుకోవడంతో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. కార్యక్రమంలో కోచ్ వెంకటేష్, ఎస్బీసీఐ రాంలాల్, తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్, కరస్పాండెంట్ మల్లేష్, డైరెక్టర్ తిరుపతయ్య, ప్రిన్సిపాల్ రఘు, పీఈటీ సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైద్యం.. దైన్యం



బాలానగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్

- కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్యులు కరువు
- డాక్టర్ల డిప్యూటేషన్ రద్దుతో సమస్య
- వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చి తిరిగి వెళ్తున్న జనం
- నిరుపయోగంగా అధునాతన పరికరాలు

బాలానగర్: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్యం దైన్యంగా మారింది. వైద్యుల కొరతతో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా మారింది ప్రజల పరిస్థితి. 44వ నంబర్ జాతీయ రహదారిని అనుసరించి ఉన్న బాలానగర్ మండలంలో 37 గ్రామపంచాయతీలతో పాటు రాజాపూర్ మండలంలోని 24 గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో రూ.5 కోట్లతో నిర్మించిన 30 పడకల ఆస్పత్రి (సీహెచ్‌సీ)ని 2022లో అప్పటి వైద్యారోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు ప్రారంభించారు. అప్పటి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవతో ఆస్పత్రిలో అధునాతన పరికరాలను ఏర్పాటుచేశారు. డిప్యూటేషన్‌పై వైద్యులతో పాటు ఆరుగురు స్టాఫ్ నర్సులను నియమించడంతో ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుత ప్రభుత్వం నూతన వైద్యుల నియామకం కోసం డిప్యూటేషన్ రద్దు చేసినా.. ప్రక్రియ ఆలస్యం అవుతుండడంతో.. స్థానిక ప్రజలకు శాపంగా మారింది. సీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది కొరతతో వైద్యం అందడం లేదు. రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన అధునాతన పరికరాలు నిరుపయోగంగా మారాయి. అనారోగ్యం ఇతరత్రా కారణాలతో ఆస్పత్రికి వెళ్లే వారికి డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు.



ఆస్పత్రిలో నిరుపయోగంగా ఉన్న పరికరాలు

సకాలంలో వైద్యం అందక అనంతలోకాలకు..

44వ నంబర్ జాతీయ రహదారి, పరిశ్రమల్లో చోటుచేసుకునే ప్రమాదాల్లో గాయపడిన వారికి సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 15 కి.మీ. దూరంలో ఉన్న షాద్‌నగర్ లేదా.. 25 కి.మీ. దూరంలో ఉన్న జడ్చర్ల ఆస్పత్రులకు తరలించాల్సి వస్తోంది. గత నెల 15న కేతిరెడ్డిపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించేలోపే మృతిచెందాడు. స్థానికంగా వైద్యం అందిస్తే క్షతగాత్రుల ప్రాణాలు నిలిచే అవకాశం ఉంది. అధునాతన ఆస్పత్రిలో నెలకొన్న వైద్యుల కొరతను ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

మండలంలో ఇదీ పరిస్థితి..

50వేలకు పైగా జనాభా ఉన్న బాలానగర్ మండలంలో ఒక్క ఎంబీబీఎస్ డాక్టర్ మాత్రమే ఉన్నారు. బాదేపల్లి నుంచి ఒక డాక్టర్ ఇన్‌చార్జిగా ఉన్నా వైద్యం అంతంతమాత్రంగానే అందుతోంది. తాజాగా మండలకేంద్రంలోని పీహెచ్‌సీకి ఒక డాక్టర్‌ను కేటాయించారు. బాలానగర్ సీహెచ్‌సీతో పాటు మోతీఘనపూర్, గుండేడ్, చిన్నరేవల్లి, కల్లేపల్లి గ్రామాల్లో డీపీహెచ్‌సీలు ఉన్నాయి. కాగా వైద్యులు, సిబ్బంది కొరత కారణంగా ప్రజలు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, సీహెచ్‌సీలో వైద్యుల కొరతను తీర్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.

డాక్టర్లను పెట్టి మంచి మందులు ఇవ్వాలి..

బాలానగర్‌లో పెద్ద ఆస్పత్రి ఉందని వచ్చాను. ఇక్కడ డాక్టర్లు లేరు. సిబ్బంది మందులు ఇచ్చి పంపారు. ఇంత పెద్ద ఆస్పత్రిలో వైద్యులు లేకపోవడం తిప్పలు పడుతున్నాం. ఆస్పత్రిలో డాక్టర్లను పెట్టి, మంచి మందులు ఇచ్చేలా చూడాలి.

– కోట్యానాయక్, బీబీనగర్ తండా, బాలానగర్ మండలం

త్వరలోనే వైద్యుల నియామకం

బాలానగర్ సీహెచ్‌సీకి ఇప్పటికే 14 మంది స్టాఫ్ నర్సులను కేటాయించారు. త్వరలోనే వైద్యుల కేటాయింపు జరగనుంది. వైద్య సేవలకు ఆటంకం లేకుండా ఇన్‌చార్జి వైద్యుడిని ఏర్పాటుచేశాం. సీహెచ్‌సీలో అవసరం మేరకు 10 మంది వైద్యులను నియమించే అవకాశం ఉంది.

– సోమశేఖర్, డీసీహెచ్‌ఎస్

మోదీతో పోటీపడేది రాహుల్‌గాంధీనే



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యేలు, యెన్నం, జీఎంఆర్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్

స్టేషన్ మహబూబ్‌నగర్: దేశంలో అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. వంశీచంద్‌రెడ్డి న్యాయ్‌యాత్ర మంగళవారం వన్‌టౌన్ లైబ్రరీ, రాంమందిర్ చౌరస్తా, పాన్‌చౌరస్తా, క్లాక్ చౌరస్తా వరకు నిర్వహించారు. అనంతరం కార్నర్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. లోక్‌సభ పరిధిలో రాహుల్‌గాంధీ భారత్‌జోడోయాత్ర చేపట్టారని, ఇక్కడ అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలిచినట్లు గుర్తుచేశారు. దేశంలో మోదీతో పోటీపడేది రాహుల్‌గాంధీయేనని అన్నారు. రాహుల్‌గాంధీతో కలిసి నడవాలనే ఉద్దేశంతో తాను ఎంపీగా పోటీచేయడానికి ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజాపాలన కొనసాగుతున్నట్లు తెలిపారు. గ్యారంటీ పథకాలను ఒక్కొక్కటి అమలుచేస్తున్నట్లు తెలిపారు. ఇల్లులేని పేదలకు ఇల్లు కట్టుకోవడానికి రూ.5లక్షలు ఇచ్చే కార్యక్రమాన్ని ఈనెల 11న మొదలవుతుందని తెలిపారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు కష్టపడి రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చారని, రానున్న ఎంపీ ఎన్నికల్లో వంశీచంద్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్, నాయకులు ఎన్పీ వెంకటేశ్, సురేందర్‌రెడ్డి, జహీర్ అఖ్తర్, లక్ష్మణ్‌యాదవ్, అజ్మత్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వసూళ్లపై శ్రద్ధ అవసరం

- 4 రోజుల్లో 50 శాతానికి చేరుకోవాలి
- స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఆస్తిపన్ను వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు 35శాతమే ఆస్తిపన్ను వసూలు కావడమేమిటని ప్రశ్నించారు. వచ్చే నాలుగు రోజుల్లో కనీసం 50 శాతానికి చేరుకోవాలని, ప్రతి ఒక్కరూ లక్ష్యం చేరుకోవాలన్నారు. ఈనెల 9న మళ్లీ ఇక్కడికి వచ్చి ఇదే విషయంపై సమీక్షిస్తామన్నారు. కాగా, ఎవరు ఎన్ని గంటలు పనిచేస్తున్నది? ఆయన ఆరా తీశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, ఏఎంసీ జె.పవన్ కుమార్, ఆర్‌ఓ మహమ్మద్ ఖాజా, ఆర్‌ఐలు ఎన్.నర్సింహులు, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు తాగునీరు, నల్లాబిల్లులు, వసూళ్లపై ఫిట్టర్లు, లైన్‌మన్లతో మున్సిపల్ కమిషనర్ సమీక్షించారు.



మున్సిపల్ అధికారులు, సిబ్బందితో సమీక్షిస్తున్న స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తాం



మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఫోరం సభ్యులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ/ పాలమూరు: సీనియర్ సిటిజన్ ఫోరానికి సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని స్థానిక మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ హామీ ఇచ్చారు. మంగళవారం మెట్టుగడ్డలోని సీనియర్ సిటిజన్ ఫోరం కార్యాలయంలో ఆయనను సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కాగా మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేసుకొని కూర్చున్నాయని, గతంలో కౌన్సిలర్స్‌కు స్వేచ్ఛ లేక సమస్యలు పరిష్కారించలేకపోయారని మున్సిపల్ చైర్మన్ అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు, ఉపాధ్యక్షుడు ఎం.బాలయ్య, కార్యదర్శి నస్కంటి నాగభూషణం, సభ్యులు అక్కినేని నారాయణరావు, రాజసింహుడు, మల్లికార్జున్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

పాలమూరు: తెలంగాణకు గత తొమ్మిది ఏళ్ల కాలంలో ప్రధాని మోదీ రూ. వేల కోట్లు అభివృద్ధి పనుల కోసం ఇచ్చారని బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్ అన్నారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏటా కుటుంబానికి రూ. ఐదు లక్షల ఆరోగ్య భీమా, రాష్ట్రంలో 75.75లక్షలకు పైగా ఆయుష్మాన్ కార్డులు జారీ చేసినట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యాటకం అభివృద్ధి కోసం రూ.91.62కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. అలంపూర్ ఆలయం ప్రసాద్ పథకం కింద అభివృద్ధి కోసం రూ.36.73కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. దీంతో పాటు అలంపూర్ రుద్రేశ్వర(రామప్ప) ఆలయం వద్ద తీర్థయాత్ర వారసత్వం పర్యాటక మౌళిక సదుపాయాల కల్పన కోసం రూ.62కోట్లు మంజూరు చేశారన్నారు. తెలంగాణ అభివృద్ధికి బీజేపీ సర్కార్ కట్టుబడి ఉందని, ఎన్నో సంక్షేమ పథకాలు పేదలకు అందిస్తున్నట్లు తెలిపారు. 2004–14మధ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇచ్చిన నిధులతో పోల్చితే 1.5రెట్లు అధికమన్నారు. తెలంగాణలో 2500 కిలోమీటర్లకు పైగా పొడవైనా జాతీయ రహదారులు నిర్మించినట్లు తెలిపారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఉంటే ఇంకా వేగంగా అభివృద్ధి జరుగుతుందన్నారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, బాలరాజు, కృష్ణవర్ధన్‌రెడ్డి, సత్యం, నంబిరాజు, బుచ్చిరెడ్డి, అంజయ్య, చిన్న వీరయ్య, నారాయణ యాదవ్, మఠం మయూరీనాథ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాంతికుమార్

ఇసుక రవాణా నిలిపివేయాలి



మాట్లాడుతున్న నాయకులు

మిడ్జిల్: ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మండలంలోని అయ్యవారిపల్లి నుంచి ఇసుక రవాణాకు ఇచ్చిన అనుమతి రద్దు చేయించాలని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తిరుపతి కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రైతులను దృష్టిలో ఉంచుకొని వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు నరేందర్, వెంకట్‌రెడ్డి, నరేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ టికెట్ బీసీలకే ఇవ్వాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పాలమూరు పార్లమెంటు పరిధిలో అత్యధికంగా జనాభా కలిగిన బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికే ఎంపీ టికెట్ ఇవ్వాలని సీనియర్ న్యాయవాది, బీసీ ఐక్య కార్యచరణ సమితి రాష్ట్ర నాయకుడు వకీల్ భీమయ్య, రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది కురుమయ్య డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ చౌరస్తాలో సమావేశం నిర్వహించారు. గెలుపోటములను శాసించే స్థానంలో ఉన్న వాల్మీకి బోయలకు టికెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తే మూల్యం తప్పదన్నారు. బీసీలకు ఎవరు అవకాశం ఇస్తే ఆ పార్టీకి మద్దతుగా నిలుస్తామని అన్నారు. తెలంగాణ వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు పానకల్ కష్టయ్య, ఎర్ర నర్సిములు వాల్మీకి, రాచాల శ్రీనివాసులు, అల్లన్న, శివకుమార్, సతీష్ కుమార్, నర్సింలు, పరమేష్, హోటల్‌శివ పాల్గొన్నారు.



ప్రభుత్వ బడుల్లో వసతులు కల్పించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో తక్షణమే వసతులు కల్పించాలని టీపీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మరికంటి బాల్‌రాజ్ పేర్కొన్నారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని టీపీఆర్టీయూ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థికి క్రమం తప్పకుండా యూనిఫాంలు, నోటుపుస్తకాలు ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వం విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం అందిస్తామని అట్టహాసంగా పథకాన్ని ప్రారంభించింది. కానీ ప్రస్తుతం అది పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని, దాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. గురుకులాలకు ఏటా రూ. లక్షల్లో ఖర్చు చేస్తున్నారని, కానీ ప్రభుత్వ బడుల్లో చదివే వారికి కనీస వసతులు ఇవ్వడం లేదన్నారు. ఉచిత విద్యుత్, పాఠశాలను శుభ్రం చేసేందుకు సిబ్బందిని, నిర్వహణ కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి విజయభూషన్, నాయకులు సురేష్, కుర్మయ్య, విశాల్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

మహబూబ్‌నగర్ క్రీడలు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, కరాటే మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలని మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం కింగ్‌షోటోకాన్ కరాటేడూ ఇండియా ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ తన నివాసంలో బెల్టులు పొందిన విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ కరాటే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండవచ్చని అన్నారు. మాస్టర్ జహంగీర్ పాష ఖాద్రీ మాట్లాడుతూ విద్యార్థులకు స్థానిక మహాత్మాగాంధీ రోడ్డు స్కూల్ ఆవరణలో కరాటే శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. గ్రేడింగ్ పరీక్షలో చాంద్‌పాషా, హఫ్సాబేగం, అయేషా బేగం, మహ్మద్ అబ్దుల్ అజీజ్, మెహ్విష్‌ఖాన్ డబుల్ ప్రమోషన్ బెల్టులు పొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో కింగ్‌షోటోకాన్ వైస్ చైర్మన్ చెన్న వీరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ రఫీక్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలపై ఆందోళన వద్దు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులు పరీక్షలపై ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా ఎస్సీ కులాల అభివృద్ధి శాఖ అధికారి పాండు పేర్కొన్నారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో విద్యార్థులకు ప్రేరణ తరగతులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ దశల్లో విద్యార్థులకు శారీరక, మానసిక పరమైన మార్పులు వస్తుంటాయని, వాటి గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మన ముందు ఉన్న లక్ష్యాన్ని చేరుకునేందుకు విద్యార్థులు ఇష్టంగా చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. ప్రశాంతంగా, ఎటువంటి ఒత్తిడి లేకుండా విజయవంతంగా పరీక్షలు రాయాలన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ కౌన్సిలర్ భాగ్యలక్ష్మి, అధికారులు గీత, మాధవి, పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యకు పరిష్కారం



డబుల్ బెడ్‌రూం కాలనీవాసులతో కాంగ్రెస్ నాయకులు

భూత్పూర్: మున్సిపాలిటీలోని సిద్దాయిపల్లి వద్ద నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద నీటి సమస్య ఉండగా ఎమ్మెల్యే జి.మధుసుదన్‌రెడ్డి చొరవతో మంగళవారం చర్యలు చేపట్టారు. రెండు 10హెచ్‌పీ మోటర్‌లు కొనుగోలు చేసి మిషన్ భగీరథ ద్వారా డబుల్‌బెడ్‌రూంలకు నీటి సరఫరా చేశారు. కాంగ్రెస్ పట్టణశాఖ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్, మహిళా అధ్యక్షురాలు పద్మ నరేందర్ మోటర్ స్విచ్ ఆన్‌చేసి నీటిని విడుదల చేశారు. ఇటీవల లిక్కి నవీన్ గౌడ్ నీటి సమస్యపై ఎమ్మెల్యే జి. మధుసుదన్‌రెడ్డికి వివరించగా ఆయన రూ.5లక్షల మంజూరు చేశారు. నాయకులు మట్టి ఆనంద్ , శ్రీనివాసులు, మల్లిఖార్జున్, బలరాం, వెంకటయ్య, నర్సింహులు నవీన్ కుమార్, ఎర్రన్న, రవితేజ పాల్గొన్నారు.

చీడపీడల నుంచి పంటలను కాపాడాలి

రాజాపూర్: రైతులు తాము సాగుచేసుకున్న పంటలను చీడపీడలు ఆశించకుండా చర్యలు తీసుకుని కాపాడుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి నరేందర్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని రాఘవాపూర్, ముదిరెడ్డిపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి పైర్లను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రతలను రైతులకు సూచించారు. ముఖ్యంగా ఈ యాసంగిలో కత్తెర పురుగు పంటలను ఎక్కువగా ఆశించి పాడు చేస్తుందని నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా కూరగాయలు సాగు చేస్తున్న రైతులు మెళకువలు పాటించి జాగ్రతలను తీసుకోవాలన్నారు. మండల ఏఈఓ శ్రీనివాస్, రైతులు న్నారు.



సూచనలు చేస్తున్న ఏఓ నరేందర్

‘ఉపాధి’ కూలీల సంఖ్య పెంచాలి



తీగలపల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

నవాబుపేట: ఉపాధి కూలీల సంఖ్యను మరింత పెంచాల్సిన అవసరం ఉందని డీఆర్‌డీఏ పీడీ నర్సింహులు సూచించారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని తీగలపల్లి, కాకర్లపహాడ్, నవాబుపేట గ్రామాల్లో నర్సరీలు, ఉపాధి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో ప్రజలకు ఉపాధి చూపాలని, ప్రతి గ్రామంలో 150కి తగ్గకుండా కూలీలు పనులకు వచ్చేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. నర్సరీల్లో మొక్కలను టార్గెట్ ప్రకారం పెంచాలని వాటి నిర్వహణపై మండల అధికారులు నిత్యం పర్యవేక్షణ చేయాలని వివరించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్, ఈఓపీఆర్‌డీ బద్రునాయక్, ఏపీఓ జ్యోతీ తదితరులు ఉన్నారు.

సైబర్‌నేరాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీఐ ఆదిరెడ్డి

జడ్చర్ల టౌన్: సైబర్‌నేరాలు, లైంగిక వేధింపులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సీఐ ఆదిరెడ్డి అన్నారు. మంగళవారం బాదేపల్లి జెడ్పీహైస్కూల్ విద్యార్థినులతో ఆయన సమావేశం అయ్యారు. పరీక్షలు సమీపించినందున చదువుపై ఏకాగ్రత ఉంచాలన్నారు. ఇప్పటికే ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకుని దాన్ని సాధించే దిశగా అడుగులు వేయాలన్నారు. ఎలాంటి లక్ష్యం నిర్దేశించుకోని వారు సైతం సరైన నిర్ణయం తీసుకోవటానికి ఇదే సమయం అన్నారు. చదువుతోపాటు సమాజంలో జరుగుతున్న మార్పుల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్‌లు వినియోగించటం వల్ల అనేక సైబర్‌నేరాలకు అవకాశం కలుగుతుందని, దాన్ని దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉండాలన్నారు. లైంగిక వేధింపులున్నట్లయితే ఆరంభంలోనే నియంత్రించేందుకు తల్లిదండ్రులు, గురువులకు సమాచారం ఇవ్వాలని, ఇంకా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. షీటీంలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.